సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



అద్భుత కట్టడాలు..అలనాటి జ్ఞాపకాలు

వందల ఏళ్ల నాటి ఇంజనీర్ల నిర్మాణ నైపుణ్యాలకు తార్కాణాలు రంగణీమహల్, మగ్గీరా, రాతిమసీదులు. చరిత్రాత్మక గుర్రంకొండ కోటలో అద్భుత కళాభవనాలు ఇవి. - 8లో



వైఎస్సార్‌సీపీ నాయకులపై వేధింపులు

వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు పోతోంది. చివరకు సొంత భూమిలో మొక్కలు నాటుకుంటున్న నాయకులను అడ్డుకుంటోంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.400
రెండోరకం	రూ.240	రూ.356

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మిట్స్ కళాశాలలో 117 మందికి ప్రగతి స్కాలర్‌షిప్‌లు



స్కాలర్ షిప్పులు అందుకున్న విద్యార్థినులు

కురబలకోట : మదనపల్లె సమీపంలోని అంగళ్లులో ఉన్న మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థినులు 117 మందికి ఏఐసీటీఈ మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేసినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ శనివారం తెలిపారు. చదువుకోవాలన్న ఆలోచన, తెలివి తేటలు ఉండి ఆర్థిక స్థోమత పరిస్థితుల వల్ల చదువుకు దూరం అవుతున్న అమ్మాయిలు విద్యలో నిరాటంకంగా రాణించడానికి ఏఐసీటీఈ ఈ స్కాలర్‌షిప్‌లతో భరోసా ఇస్తోందన్నారు. ప్రగతి పేరుతో విద్యార్థినులకు రూ.50 వేలు చొప్పున అందించినట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల విద్యార్థినులను అభినందించారు.

లోక్‌అదాలత్‌లో 106 కేసులు పరిష్కారం



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు

రాయచోటి టౌన్ : రాయచోటి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్ ద్వారా వివిధ రకాలైన కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని అన్నారు. క్రిమినల్ ఎంవీఓపీ యాక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎన్ఐయాక్ట్ ఇన్సూరెన్స్ వంటి కేసులు మొత్తం 106 కేసులు పరిష్కరించడంతో పాటు వాటి ద్వారా రూ.2,10,54,797లు నష్టపరిహారం చెల్లించే విధంగా తీర్పు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసీఫా సుల్తాన్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ శారద, లోక్‌అదాలత్ సభ్యులు రాజకుమారి చంద్ర, ఎం ఖాదర్‌బాషా, కుమార్, ధనుంజయకుమార్, వి అజ్మతుల్లా, ఆర్. వీరభద్రయ్య, ఎం. నాగేశ్వరావు, ఎం. వెంకటరమణ, వి. శ్రీధర్ మూర్తి, కోర్టు సిబ్బంది బి. శ్రీవాణి, మేనక, రాజేశ్వరి, రమణ, నరసింహారెడ్డి, కె. ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

18న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-17 బాల,బాలికల ఫుట్‌బాల్ జట్టును ఈనెల 18న ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు. స్థానిక శానిటోరియం వద్దనున్న శ్రీవేద ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 1.1.2008 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద వయస్సు ధృవీకరణపత్రాలు,ఆధార్, క్రీడా దుస్తులతో హాజరు కావాలని కోరారు. వివరాలకు భద్రయ్య 9490825832, వసంత 9010534818, నాగరాజు 7032140712 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు, ఎల్లుండి కేవీకేలో శిక్షణ

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రంలో వానపాముల ఎరువుల తయారీపై ఈనెల 16,17 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు 8096688039 నెంబర్‌కు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి కడప రాయుని పవిత్రోత్సవాలు

కడప కల్చరల్ : కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలను ఆదివారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నామని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో అంకురార్పణం, విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, రక్షాబంధన్, మృత్సంగ్రహణం, అఖండ దీపారాధన తదితర పూజలు ఉంటాయని తెలిపారు. 16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చతుస్థాన ఆరాధన, ద్వారతోరణ, అనంత కళా పూజ, అగ్నిప్రతిష్ఠ, పవిత్రాల ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నిత్య హోమం నిర్వహిస్తామన్నారు. 17న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పవిత్రాల సమర్పణ ఉంటుందని, సాయంత్రం పవిత్ర హోమాలు ఉంటాయన్నారు. 18న ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పవిత్రాల విసర్జనాలు, మహాపూర్ణాహుతి, చతుస్థాన ఉద్వాసనలు, కుంభ ప్రోక్షణ, పవిత్ర విసర్జన, విద్వత్ సంభావన ఉంటాయన్నారు.

పేదలంటే బాబుకు అలుసు



పేదలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలుసు. విద్య కేవలం ధనవంతులకే దక్కే విధంగా చేస్తారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో మెడికల్ కళాశాలలు మంజూరు చేశారు. వాటికి అనుమతులతో పాటు, విద్యార్థులకు సీటు కేటాయింపు చేస్తామని కేంద్రప్రభుత్వం ముందుకు వచ్చినా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. నాకుమార్తె లావణ్య నీట్ పరీక్షకు హాజరైంది. కళాశాలలు పూర్తి చేయకపోవడంతో సీటు వస్తుందో, రాదో అనే అయోమయంలో ఉన్నాం. విద్యార్థుల కష్టాన్ని వమ్ము చేయకుండా ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించాలి.

– శ్రీరాములు, పీలేరు



పేదలకు వైద్యవిద్య దూరం అవుతుంది



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు ఇచ్చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఫీజులు తక్కువగా ఉంటాయి. చదువుకునేందుకు వీలు ఉంటుంది. చిన్నప్పటి నుంచి డాక్టర్ అవ్వాలనే కోరికతో నీట్ పరీక్ష రాశాను. సీట్లు రద్దు చేస్తామని ప్రభుత్వం చెబుతుంటే సీటు రాదేమోనని భయంగా ఉంది. ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల కలలు నెరవేరేలా ప్రభుత్వం మేలు చేయాలే తప్ప అన్యాయం చేయకూడదు.

– ఆర్ వర్షిత, నీట్ విద్యార్థిని, పందిళ్లపల్లి గ్రామం, లక్కిరెడ్డిపల్లి మండలం

మొండిచేయి

- వైఎస్ జగన్ సర్కార్ హయాంలో మదనపల్లెకు మెడికల్ కళాశాల
- మొన్నటివరకు చురుగ్గా సాగుతున్న నిర్మాణాలు
- మెడికల్ సీట్లు కేంద్రం వెనక్కి తీసుకునేలా నిర్ణయంతో తిరోగమనం



మెడికల్ కాలేజీ ప్రారంభానికి జిల్లా ఆస్పత్రిలో నిర్మించిన అదనపు గదులు

సాక్షి రాయచోటి : రాష్ట్రంలోని కూటమి సర్కార్ వైద్య విద్యపై శీతకన్ను వేసింది. ఇప్పటికే పీజీకి సంబంధించి తీసుకున్న వివాదాస్పద నిర్ణయంతో డాక్టర్లు రోడ్డెక్కుతుండగా, మరోవైపు కొత్త కళాశాలల్లో మెడికల్ సీట్లు వెనక్కి తీసుకోవాలన్న నిర్ణయం మెడికల్ విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. అన్నమయ్య జిల్లాకే మెడికల్ కళాశాల కలికితురాయిగా నిలిచిపోతుందని భావిస్తున్న తరుణంలో మళ్లీ తిరోగమనబాట మొదలైంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం...2022లో జిల్లాల పునర్విభజనలో భాగంగా మదనపల్లెకు ఒక మెడికల్ కళాశాల మంజూరు చేశారు.సుమారు రూ. 475 కోట్ల వ్యయంతో పనులు కూడా ప్రారంభమై నిర్మాణాలు జరుగుతున్నాయి. పనులు శరవేగంగా అమలు జరుగుతున్న సమయంలో మదనపల్లె మెడికల్ కళాశాలకు ఎగనామం పెట్టడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది నుంచి ప్రారంభించాల్సిన కళాశాలకు సీట్ల కేటాయింపులోనే ప్రభుత్వం విముఖత చూపడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాశంతో చేపట్టిన మహా సంకల్పానికి ఆదిలోనే బ్రేక్ పడటం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డీలా పడ్డారు.

మెడికల్ కళాశాల ప్రొఫెసర్లకు ఆప్షన్లు

ఈ ఏడాది ఎలాగైనా కళాశాల ప్రారంభించాలని, అడ్మిషన్లకు కూడా జగన్ సర్కార్ సిద్ధమై జిల్లా ఆస్పత్రిని బోధనా ఆస్పత్రిగా మార్చి తరగతుల నిర్వహణకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో కొంతమంది ప్రొఫెసర్లతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నర్సింగ్ స్టాఫ్ ఇక్కడ పనిచేసేలా ప్రణాళికలు రూపొందించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రం మదనపల్లె మెడికల్ కళాశాలకు సీట్ల కేటాయింపుతోపాటు ఇతర వ్యవహారాల్లో రిక్తహస్తం చూపడం...అలాగే ఇక్కడున్న స్టాఫ్‌కు వెనక్కి వచ్చేందుకు ఆప్షన్లు ఇచ్చినట్లు తెలియవచ్చింది. దీంతో ఇక్కడికి వచ్చిన సిబ్బంది కూడా వేరే ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మెడికల్ కళాశాల ఆశలపై ప్రస్తుతం మళ్లీ నీలినీడలు అలుముకుంటున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు మెడికల్ విద్యను అభ్యసించేందుకు మదనపల్లె మెడికల్ కళాశాలలో అవకాశం ఉండేది. వారితోపాటు జిల్లాలో నీట్ రాసిన విద్యార్థులకు కూడా ఇక్కడ సీటు వచ్చే అవకాశం ఉండేది. అయితే ప్రభుత్వాలు సీట్లు కేటాయించపోవడంతో ఇక్కడి విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఏది ఏమైనా కొత్త ప్రాజెక్టులు తీసుకు రాకపోకపోగా, వచ్చిన వాటికి కూడా ఆమోదముద్ర వేయకపోవడంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యోగాసనాలతో మంచి నడవడిక



ఛాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న హైదరాబాద్ రీజియన్ క్రీడాకారులు

మదనపల్లె సిటీ : ప్రతి రోజూ యోగాసనాలు చేయడం వల్ల మంచి నడవడికతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుందని హైదరాబాద్ నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ టి.గోపాల కృష్ణ అన్నారు.శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో జాతీయ యోగా మీట్-2024 ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. విద్యార్థులు పాఠశాలలో ఉదయం సూర్య నమస్కారాలు, యోగసనాలు చేయడం వల్ల నడతలో మార్పు వచ్చి తదనంతర జీవితంలో బాధ్యత కలిగిన వ్యక్తిగా మసలుకొనే అవకాశం ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు జరిగిన యోగా పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన యోగసనాలు ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో నవోదయ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణన్, మదనపల్లె నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ వేలాయుధన్, నవోదయ బెంగుళూరు రూరల్ ప్రిన్సిపాల్ చక్రవర్తి, సత్యసాయి జిల్లా ప్రిన్సిపాల్ నాగరాజ్, పి.జగదీష్‌కుమార్,లక్ష్మినారాయణ, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్ రీజియన్‌కు మొదటి స్థానం:

జాతీయ యోగా మీట్‌లో 7207.5 పాయింట్లతో హైదరాబాద్‌రీజియన్ మొదటి స్థానం దక్కించుకుని ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకున్నారు. 7001 పాయింట్లతో జైపూర్ రీజియన్ రెండో స్థానం, 6945.5 పాయింట్లతో భోపాల్ రీజియన్ మూడవ స్థానం కైవసం చేసుకుంది. విజేతలకు బహుమతులు అందజేశారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు : కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో రైతులు వ్యవసాయంలో వచ్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సీఎస్ఎఫ్ డీపీఎం ప్రవీణ్ కుమార్ అన్నారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన పంటలపై రైతులకు ఐదు రోజులుగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజు శనివారం పలు రకాల పూల సాగు - విలువ జోడింపు విధానాలపై రైతులకు శిక్షన ఇచ్చారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పంటల సాగులో కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు బాసటగా నిలుస్తుండటం అభినందనీయమన్నారు. కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ పూల సాగులో పాటించాల్సిన భూసార పరిమితులు, ఎరువుల యాజమాన్యం, నేల, విత్తన రకాల అంశాలపై సమగ్రంగా వివరించారు. పై అంశాలను రైతులు పాటిస్తే పూల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ , గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ పూల కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రవాణా, నిల్వ చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. పూల పంటలో విలువ జోడింపు విధానాలు, పరిమళ ద్రవ్యాలు, నూనెలు, సహజ రంగుల తయారీలో ఉపయోగించడంపై వివరించారు. అనంతరం పూల సాగుపై కేవీకే ప్రచురించిన బుక్‌లెట్లను శాస్త్రవేత్తలు, రైతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వనిపెంట ఎఫ్‌పీఓ చైర్మన్ బాల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నందలూరుకు మరోసారి అన్యాయం!

- వైఎస్సార్ జిల్లాపై విషంకక్కిన కూటమి సర్కార్
- పాకాలలో కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్‌సిగ్నల్
- బాబు లోకల్‌ఏరియాకు రైల్వేపరిశ్రమ తరలింపు



నందలూరు స్టీమ్ ఇంజిన్‌లోకోషెడ్(ఫైల్)

రాజంపేట : గుత్తి-రేణిగుంట డబుల్‌లైన్ మార్గంలోని బ్రిటీషు రైల్వేపాలకులలో వైభవంగా వెలుగొందిన నందలూరు రైల్వేకేంద్రానికి మరోసారి అన్యాయం జరిగింది. వైఎస్సార్ జిల్లాపై పరోక్షంగా కూటమిసర్కార్ విషంకక్కింది. కొన్నేళ్లుగా నందలూరు రైల్వేపరిశ్రమ ఏర్పాటుచేయాలని ఉద్యమాలు, వినతులు జరిగినా, అది కాదని పాకాలలో కోచ్ (సింగల్‌లైన్) ఫ్యాక్టరీని ఏర్పాటుచేసేందుకు రైల్వేశాఖ సన్నద్ధమైంది.తిరుపతి సీఆర్ఎస్ ఉండగా, పాకాల స్టేషన్‌లో ఏర్పాటుచేయడం కేవలం ఏపీ సర్కార్‌పై ప్రేమ కోసమే. నందలూరులో రైల్వేపరిశ్రమకు అవసరమయ్యే 145 ఎకరాలు, వందలాది క్వార్టర్స్, ఎంతటి కరువొచ్చినా పుష్కలంగా నీటి వనరులతో పాటు రైల్వేకార్మికుల కుటుంబాల నివాసానికి అనుకూలంగా ఉన్నప్పటికీ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనువైన ప్రాంతం కాని పాకాలలో పెట్టడం కేవలం కూటమి సర్కార్ కారణమనే భావన జిల్లా వాసుల్లో ఉంది.యూపీఏ ప్రభుత్వంలో నందలూరులో ప్రత్యామ్నాయ రైల్వేపరిశ్రమకు ఆనాటి కేంద్రం అంగీకరించింది. అప్పటి మంత్రి లాలూ రాజ్యసభలో ప్రకటించారు. ఇప్పటికీ రికార్డులు పరిశీలిస్తే బహిర్గతమవుతుంది. ఈ నేపథ్యంలో నందలూరు రైల్వేకేంద్రంలో వ్యాగిన్‌రిపేరు వర్క్‌షాప్ లేదా ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని అప్పటి కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో వ్యాగిన్ రిపేరువర్క్‌షాపు, కోచ్ రీహ్యాబిటేషన్ వర్క్‌షాప్ ఏర్పాటుచేస్తారనే దిశగా ఆశలు చిగురించాయి.

కోట్ల వచ్చారు..తరలించుకున్నారు..

రైల్వేశాఖ సహాయమంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి నందలూరు రైల్వేకేంద్రంలో ఏర్పాటుచేయాలనుకున్న వ్యాగిన్ రిపేర్ వర్క్‌షాప్‌ను తన ప్రాంతమైన కర్నూలుకు తరలించుకుపోయారు. ఆ విధంగా యుపీఏ పాలనలో నందలూరుకు అన్యాయం జరిగింది.రైల్వేశాఖ ఉన్నతాధికారులు(గుంతకల్ డివిజన్)నందలూరు రైల్వేకేంద్రాన్ని దశలవారీగా నిర్వీర్యం చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో లోక్‌సభలో తొలిసారిగా ఎంపీ మిథున్‌రెడ్డి నందలూరు రైల్వేకేంద్రం ప్రాముఖ్యతను సభ దృష్టికి తీసుకెళ్లారు.అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంపీ మిథున్‌రెడ్డి అనేకమార్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం కొనసాగుతోంది. ఇప్పుడు రన్నింగ్‌స్టాప్ క్రూసెంటర్ తరలిపోకుండా ఉందంటే అందుకు మిథున్‌రెడ్డి కారణమని స్పష్టమవుతోంది.

బీజేపీ చేతిలో దగా

నందలూరులో రైల్వేపరిశ్రమను ఏర్పాటుచేయాలని, 250 క్వార్టర్స్ ఉన్నాయని, 150 ఎకరాల స్థలం ఉందని అనేకమార్లు వినియోగంలోకి తీసుకురావాలని రైల్వేమంత్రిత్వశాఖకు వినతులు వెళ్లాయి. క్యారేజీ రిపేర్‌షాపు, ఎలక్ట్రికల్ ఇంజిన్ రిపేర్‌షెడ్ ఏర్పాటు చేయాలని వినతులు వెల్లువెత్తాయి. అయితే ఇవేవీ బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. రెండు దశాబ్దాల కిందట బీజేపీకి చెందిన పెద్దలు నందలూరుకు వచ్చి అధికారంలోకి రాగానే రైల్వేపరిశ్రమ ఏర్పాటుచేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. బీజేపీ అగ్రనేత నడ్డా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నందలూరు లోకోషెడ్‌ను చూసి వెళ్లారు.మూడోసారి ముచ్చటగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేతిలో మరోసారిగా నందలూరు దగాపడింది.

బాబులోకల్ ఏరియాలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లోకల్ ఏరియాలో ఉన్న పాకాల రైల్వేస్టేషన్‌లో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ పెట్టడానికి రైల్వేశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈనెల 9న దక్షిణమధ్య రైల్వే ఆధ్వర్యంలో నిర్వహించిన రైల్వేభద్రతా కమిటీ సమావేశంలో పాకాల రైల్వేస్టేషన్‌కు సంబంధించిన పనులకు ఆమోదం లభించింది. ఈమేరకు గుంతకల్ డివిజన్‌కు ఉత్తర్వులు అందాయి. త్వరలో కోచ్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభం కానున్నాయి. ఎటువంటి ప్రతిపాదన లేని పరిస్థితిలో పాకాలలో రైల్వేపరిశ్రమ ఏర్పాటు చేయడమంటే కూటమి సర్కార్ ప్రభావమేనని తెలుస్తోంది.

కూటమిసర్కార్ వివక్ష



రైల్వేపరిశ్రమ ఏర్పాటుకు అనుకూలమైన నందలూరు వైఎస్సార్‌జిల్లాలో ఉందనే కూటమి ప్రభుత్వం వివక్షను ప్రదర్శించింది. నేను కూడా రైల్వేపరిశ్రమకోసం ఆమరణదీక్ష చేశాను. ఎంపీ మిథున్‌రెడ్డి అనేకమార్లు కేంద్రానికి విన్నవించారు. పాకాలలో రైల్వేపరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదన ఇప్పటి వరకు ఏదీ తెరపైకి రాలేదు. బాబు మెప్పుకోసమే కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు చేశారు.

– ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

పాకాలలో రైల్వేపరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదన లేదు




పాకాలలో ఎలాంటి పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనలేదు. ఈ విషయం ఎంపీలందరికీ తెలుసు. ఆకస్మాత్తుగా కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు తెరపైకి వచ్చింది. ఇదంతా చంద్రబాబు మెప్పు కోసమే. నందలూరులో రైల్వేపరిశ్రమ ఏర్పాటుపై ఎన్‌డీఏ సర్కారు నిర్లక్ష్యం చేసింది.

– షేక్‌మహమ్మద్‌అలీ, మాజీ ఏజీపీ, నందలూరు

ఖరీఫ్ ఖతం..

- జిల్లాలో తగ్గిన సాగు విస్తీర్ణం
- 40,990 హెక్టార్ల సాగు భూములు బీళ్లు



బి.కొత్తకోట మండలంలో సాగులేక బీళ్లుగా మారిన భూములు

బి.కొత్తకోట : జిల్లాలో ఖరీఫ్ సాగు దారుణంగా పడిపోయింది. 90శాతం వ్యవసాయం ఖరీఫ్‌పైనే ఆధారపడి ఉండగా సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో దాని ప్రభావం రైతులపై పడింది. ఎన్నడూలేనంత దారుణమైన విస్తీర్ణంలో వేరుశనగ సాగైంది. ఒక పంటపై కాకుండా అన్ని పంటలపైనా తీవ్ర ప్రభావం చూపడం ఇదే ప్రథమం. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో ఖరీఫ్ ఖతమైంది. దీంతో ప్రత్యామ్నయంగా ఉలవల సాగుకు ప్రభుత్వం ప్రణాళిక అమలు చేస్తోంది. జిల్లాలోని 23 మండలాల్లో ఉలవలు సాగయ్యేలా 9,422 క్వింటాళ్లను కేటాయించగా రైతులకు పంపిణి చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

37 శాతం విస్తీర్ణమే సాగు

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ పంటలు 65,386 హెక్టార్లలో సాగవ్వాలని నిర్ణయించారు. అయితే సకాలంలో వర్షాలు కురవకపోవడంతో కేవలం 37.31 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి.ఇందులో వేరుశనగ అత్యధికంగా 42,852 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా సెప్టెంబర్ 12 నాటికి కేవలం 13,390 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. మొత్తం సాగు జరగాల్సిన 65,386 హెక్టార్లలో అన్నిపంటలు కలుపుకుని 24,396 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. అంటే 40,990 హెక్టార్ల సాగుభూములు బీళ్లుగా మిగిలిపోయాయి.

9,422 క్వింటాళ్ల ఉలవలు పంపిణీ

జిల్లాలోని 23 మండలాలకు మాత్రమే ప్రత్యామ్నయ పంటల సాగుకు ప్రణాళిక అమలు చేస్తున్నారు. రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలను మినహాయించారు. ఖరీఫ్‌లో వేరుశనగ పంటలను సాగు చేయని రైతులకు ఉలవలను పంపిణీ చేస్తారు. ఈ మండలాలకు 9,422 క్వింటాళ్లను కేటాయించారు. వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్న తంబళ్లపల్లె నియోజకవర్గానికి అధికంగా కేటాయించారు. ఆరు మండలాలకు 4,039 క్వింటాళ్లు కేటాయించారు. ఒక్కో రైతుకు 5 ఎకరాల వరకు ఉలవలు ఇస్తారు. ఎకరాకు 10 కిలోలు చొప్పున 50 కిలోలు ఇస్తారు. కిలో పూర్తి ధర రు.87 కాగా ప్రభుత్వం కిలోకి రూ.69.60 పైసలు రాయితీ ఇస్తుంది, ఇది పోను రైతులు కిలోకి రూ.17.40 పైసలు చెల్లించాలి.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక




ఖరీఫ్ సాగు పడిపోయింది. ప్రత్యామ్నయ పంటలు సాగుచేసేలా ప్రణాళికలు రూపొందించాం. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అందుకు అనుగుణంగా జిల్లాకు 9,422 క్వింటాళ్ల ఉలవలు కేటాయించారు. వీటిని మండల కేంద్రాలు, రైతుభరోసా కేంద్రాల్లో నిల్వ చేసి రైతులకు పంపిణీ చేస్తాం.

– చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, రాయచోటి

వర్షపాతం వివరాలు (మి.మీ)

నెల	సాధారణం	కురిసింది
మే	43	78.5
జూన్	75.1	160.6
జూలై	90.5	18.3
ఆగష్టు	99.8	99.7
సెప్టెంబర్	114.7	17.9 (12వ వతేది వరకు)



సాగైన పంటల విస్తీర్ణం(హెక్టార్లలో)

పంట	సాగు లక్ష్యం	సాగైంది
వేరుశనగ	42,852	13,390
వరి	10,037	7,018
సజ్జలు	567	331
మొక్కజొన్న	1,848	2,089
రాగి	405	157
కందులు	2,971	702
ఉలవలు	4,236	119
అలసంద	697	204
అనుములు	497	123

ఉలవల కేటాయింపు

మండలం	క్వింటాళ్లు
చిన్నమండెం	166
సంబేపల్లె	472
టి.సుండుపల్లె	191
రాయచోటి	219
గాలివీడు	360
లక్కిరెడ్డిపల్లె	445
రామాపురం	248
వీరబల్లి	138
తంబళ్లపల్లె	876
ములకలచెరువు	753
కురబలకోట	421
పెద్దతిప్పసముద్రం	969
బి.కొత్తకోట	599
మదన పల్లె	324
నిమ్మనపల్లె	326
రామసముద్రం	391
కంభంవారిపల్లె	636
పీలేరు	384
పెద్దమండ్యం	421
గుర్రంకొండ	250
కలకడ	228
కలికిరి	291
వాయల్పాడు	317

పేకాట స్థావరంపై దాడి

పుల్లంపేట : మండలంలోని వత్తలూరు ఈడిగపల్లి వద్ద పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ. 5070లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

కట్టెల ట్రాక్టర్ బోల్తా

త్రుటిలో తప్పిన ప్రమాదం

గాలివీడు : ప్రమాదవశాత్తు కట్టెల ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. అదృష్టవశాత్తూ ప్రమాద ఘటనలో ఎవ్వరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శనివారం సాయంత్రం గాలివీడు నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో గేటు నాలుగురోడ్ల కూడలి వద్ద మలుపు తిరిగే క్రమంలో అధిక లోడ్ కలిగిన కట్టెల ట్రాక్టర్ ఓవైపు ఒరిగి పోయింది. వెనుక టైర్లు గాలిలో తేలుతూ బోల్తాపడింది. అదే సమయంలో వినాయక నిమజ్జనానికి వెళుతున్న భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడే ఉండటంతో ఏం జరిగిందోనని అందరూ ఉలిక్కిపడ్డారు. అయితే అదృష్టవశాత్తూ ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం



ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అధికంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉంటే పేద విద్యార్థులు కూడా ఉచితంగా వైద్యవిద్య కోర్సుల్లో సీట్లు పొంది, వారి తల్లిదండ్రుల కలను సాకారం చేస్తారు. కానీ మంజూరైన కళాశాలలు పూర్తి చేయకుంటే వచ్చే ఏడాది కూడా ఏపీలో సీట్లు పెరగవు. దీంతో పేద విద్యార్థులకు సీట్లు లభించే అవకాశం లేదు. సీటును డబ్బుపెట్టి కొనే స్థితిలో పేదలు , మధ్య తరగతి కుటుంబాల వారులేరు.

-టి.ఎల్.వెంకటేష్, ఏఐవైఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు

మెడికల్ బాబు

చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు మానుకోవాలి



గత ప్రభుత్వం చేసిన మంచి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు చేయడం మానుకోవాలి. ప్రజలకు మంచి జరిగే ఉద్దేశంతో చేపట్టిన ఏ పనులనైనా మంచిగా ఆలోచన చేయాలి. మెడికల్ కళాశాలల పట్ల ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న ద్రోహం క్షమించరానిది. మెడిసిన్ చదువుకునే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీట్లను చంద్రబాబు ప్రభుత్వం తిప్పి పంపించడం మంచిది కాదు. చంద్రబాబు పునరాలోచించి మెడికల్ కళాశాలల ప్రారంభానికి పూనుకోవాలి.

– ఆవుల ప్రసాద్, చిన్నమండెం

అద్భుత కట్టడాలు..

అలనాటి జ్ఞాపకాలు

- నేడు ఇంజినీర్స్‌డే సందర్భంగా ప్రత్యేక కథనం
- వందల ఏళ్లు గడుస్తున్నా చెక్కుచెదరని పురాతన కట్టడాలు
- నాటి ఇంజినీర్ల నిర్మాణ నైపుణ్యం అద్భుతం



ముందువైపు నుంచి రెండు అంతస్తులుగా కనిపిస్తున్న రంగిణీమహల్

గుర్రంకొండ : వందల ఏళ్ల నాటి ఇంజినీర్ల నిర్మాణ నైపుణ్యాలకు తార్కాణాలు రంగణీమహల్, మగ్బ్రా, రాణీ మహల్, రాతిమసీదులు. చరిత్రాత్మక గుర్రంకొండ కోటలో వందల ఏళ్ల క్రితం నిర్మించిన అద్భుత కళాభవనాలు ఇవి. ఎలాంటి యంత్రాల సాయం లేకుండా అప్పట్లోనే ఇంజినీర్లు తమ నిర్మాణ నైపుణ్యాలను అద్భుత రీతిలో చూపించారు. ప్రస్తుత నాగరిక సమాజంలో కేవలం 40 నుంచి 50 ఏళ్లకే ప్రస్తుత భవనాల మనుగడ సాగుతోంది. ఎలాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేని వందల ఏళ్ల క్రితం అప్పటి ఇంజినీర్లు సిమెంటు, కాంక్రీటు వంటి పదార్థాలు వినియోగించకుండా కేవలం పాత కాలం నాటి ఇటుకలు, సున్నం, సీసం, కలపతోనే అద్భుతమైన భవనాలు, కళాఖండాలను నిర్మించడం విశేషం.

చెక్కుచెదరని రంగిణీ మహల్

గుర్రంకొండ కోటలో చెక్కుచెదరకుండా నేటికి అలాగే ఉంది రంగిణీమహల్. ఎంతో పురాతన రాజభవనం ఇది. క్రీ.శ 17వ శతాబ్దంలో అప్పటి మైసూర్ పాలకులు టిప్పుసుల్తాన్ గుర్రంకొండ కోటకు పరిపాలకుడుగా ఉండేవాడు. ఇక్కడ తమ రాజప్రతి నిధిగా తన మేనమామ మీర్‌రజాఅలీఖాన్‌ను నియమించి అతని చేత పరిపాలన సాగించేవాడు. అప్పట్లో రాజదర్బార్‌లో రంగమ్మ అనే ఆస్థాన నాట్యకత్తె ఉండేది. ఆమెపై ప్రేమతో ఆమె పేరుమీద రంగిణీ మహల్‌ను ఇక్కడ నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఇది ముందువైపు నుంచి రెండు అంతస్తులుగానూ, వెనుకవైపు నుంచి మూడు అంతస్తులుగాను కనిపించడం దీని ప్రత్యేకత. ఈ భవనానికి ముందువైపు, వెనుకవైపు నిర్మించిన మెట్లు అలనాటి నైపుణ్యానికి నిదర్శనాలు. గదులలో మొత్తం ఎంతో విలువైన కలపను వాడారు. పైకప్పుల నిర్మాణంలో సున్నం, పాతకాలం నాటి సన్నని ఇటుకలను వినియోగించారు. గోడలు మొత్తం సన్నని ఆకారంలో ఉన్న ఇటుకలు, సున్నంతో నిర్మించారు. గోడలకు పైన పూతగా కూడా సున్నాన్నే వినియోగించడం ఈ భవనం ప్రత్యేకత. ఎన్నో గదులు ఉన్నాయి. ఓ గదిలోని దక్షిణం వైపు ఉన్న గోడలో నుంచి సొరంగ మార్గం ఉంది. శత్రురాజులు దండెత్తినప్పుడు ఈ మార్గం గుండా కోటబయటికి వెళ్లేందుకు ఈ సొరంగం ఒక మార్గంగా ఉండేది. కోటకు అల్లంత దూరంలోని కోటగోడ వెలుపలి భాగంలో ఈ భవనం నుంచి బయటకు వెళ్లే సొరంగం నేటికి ఉంది. పురాతన మెట్లు, సమావేశపు గదులు రాజరికానికి నిలువుటద్దంగా నిలుస్తాయి.



వెనుకవైపు నుంచి మూడు అంతస్తులుగా కనిపిస్తున్న రంగిణీ మహల్

రాతితో నిర్మించిన షాహజాదీ మసీదు



పూర్తిగా రాతితోనే నిర్మించిన షాహజాదీ మసీదు

బహమనీ సుల్తానుల కాలంలో రాజవంశీయుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మసీదు ఇది. పూర్తిగా రాతితోనే నిర్మించడం దీని ప్రత్యేకత. మసీదు నిర్మాణాల్లో ఎక్కడా కుడా భవన నిర్మాణానికి వినియోగించే ఇతర నిర్మాణ వస్తువులు (ఇసుక, సిమెంటు, కంకర) లాంటివి లేకుండా పూర్తిస్థాయిలో అప్పటి ఇంజినీర్ల ప్రతిభతో రాతితోనే నిర్మించారు. మసీదు నిర్మాణంలో అప్పటి కాలంలో ఉపయోగించే సీసము. సున్నము వంటివి కూడా మసీదు నిర్మాణంలో ఉపయోగించకపోవడం అప్పటి ఇంజినీర్ల పనితీరుకు నిదర్శనం. పూర్తిగా గోడలు, డూమ్‌లు, మెట్ల మార్గం, ఆర్చ్‌లు, పువ్వు ఆకారంలో చిన్న కొలను వంటి ఎన్నో ఆకృతులు, పూర్తిస్థాయిలో రాతితోనే నిర్మించడం విశేషం. ఇలాంటివి కోట పరిసరాల్లో మరో రెండు రాతిమసీదులు నేటికి ఉన్నాయి. ఏళ్ల తరబడి చెక్కుచెదరకుండా అప్పటి ఇంజినీర్లు నిర్మించిన ఈ నిర్మాణాలు నేటి తరం ఇంజినీర్లకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

అద్భుత అరబిక్ కళాఖండం మగ్బీరా



అద్భుత కళాఖండం మీర్ రజాఅలీఖాన్ సమాధి మగ్బీరా

గుర్రంకొండ కోటపక్కనే మగ్బ్రా ఉంది. పురాతన మహమ్మదీయుల అరబిక్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కట్టడం ఇది. మగ్బ్రా అంటే సమాధి అని అర్థం వస్తుంది. గుర్రంకొండ కోటను టిప్పుసుల్తాన్ మేనమామ మీర్‌రజాఅలీఖాన్ పాలించే వారు. క్రీ.శ 1745లో అతను మృతి చెందిన తరువాత అతని సమాధిని మగ్బ్రాగా నిర్మించారు. ఈ కట్టడం రెండు అంతస్తులుగా ఉంటుంది. కింది భాగంలో ఇతర సుల్తాన్ కుటుంబీకుల సమాధులు అప్పటి నాగరికతతో ఇక్కడ నిర్మించారు. పై అంతస్తులో మీర్‌రజాఆలీఖాన్ ఒక్కటి ప్రత్యేకంగా నిర్మించారు. పై అంతస్తులోకి చేరుకోవడానికి ఈ భవనానికి మూడు వైపులా మెట్ల మార్గాలు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. పై అంతస్తు భవనంలో ఒకే గది ఉండడంతో పాటు అదికూడా లోపలి పైకప్పు కోడుగుడ్డు ఆకారంలో ఉండడం విశేషం. గోల్కొండ కోటలో ఉన్న నిర్మాణాలను పోలి ఉండేటట్లుగా ఇక్కడి నిర్మాణాలు ఉంటాయి. పై అంతస్తు గదిపైన మసీదు ఆకారంలా పోలిన పెద్ద డూమ్‌ను నిర్మించారు. పై డూమ్‌కు నాలుగు వైపులా మీనార్‌లు(చార్మినార్‌కు నాలుగు వైపులా ఉన్న పొడవాటి సన్నని నిర్మాణాలు) వంటివి ఇక్కడ ఉండడం వీటి ప్రత్యేకత. ఇక్కడి డూమ్‌లో చేసే శబ్దాలు ప్రతిధ్వనించడం (రీసౌండ్) ఇక్కడి మరో విశేషం. ఎంతో అద్భుత కళానైపుణ్యంతో అలానాటి ఇంజినీర్ల ప్రతిభకు అద్దం పట్టేలా ఈ నిర్మాణాలు ఉండడం గమనార్హం. వందల ఏళ్లు గడుస్తున్నా కేవలం సున్నం సన్నపాటి ఇటుకలు, కలపతో నిర్మించిన ఈ కట్టడాలు నేటికి చెక్కుచెదరకుండా నిలిచి ఉండడం ఇంజినీర్ల నైపుణ్యాలకు నిదర్శనం.

శిల్ప కళా సౌందర్యం రాణీ మహల్

రంగిణీ మహల్‌కు ఎదురుగా ఇటీవల జరిపిన తవ్వకాల్లో రాణీ మహల్ బయటపడింది. పునాదులు, మొండిగోడలతో భవనం నేటికీ దర్శనమిస్తోంది. శిథిలమైన రాణీమహల్ భవనం గోడలు, మెట్లలో అద్భుత శిల్ప కళా సౌదర్యం ఉట్టి పడుతోంది. మెట్లకు ఇరువైపులా ఉన్న గోడలపై సగం చేప ఆకారంలో ఉన్న స్త్రీల బొమ్మలు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. భవనంలోపలి నుంచి పై అంతస్తులోకి ఉన్న మెట్ల మార్గం అప్పటి ఇంజినీర్ల ప్రతిభాపాటవాలకు నిదర్శనం. భవనం శిథిలమైనా అప్పటి ఇంజినీర్ల పనితీరు నేటి తరాలకు అద్దం పట్టేవిధంగా ఉండడం ఈ భవనం ప్రత్యేకత. నిదర్శనం.

వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆగని వేధింపులు

డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, సంబంధీకుల తోటలో మొక్కలు నాటడాన్ని అడ్డుకున్న టీడీపీ నాయకులు



దౌర్జన్యంగా గేటును తోసుకొంటూ లోపలికి వెళుతున్న కూటమి నాయకులు

రాయచోటి : వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు పోతోంది. ప్రధానంగా పార్టీలో పట్టు ఉన్న కీలక నాయకులైన ఆవుల కుటుంబ సభ్యులను ఏదో ఒకరకంగా దెబ్బతీసేందుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. చివరకు సొంత భూమిలో మొక్కలు నాటుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో మంత్రి స్వయంగా అక్కడికి వెళ్లి ఇది ప్రభుత్వ భూమి అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి కూటమి నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయి.

కోర్టు అనుమతులు ఉన్నా..

సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం మొటుకువాండ్లపల్లె క్రాస్ సమీపంలోని ఉన్న మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబీకులు సాగు చేసుకుంటున్న భూమిలో మొక్కలు నాటుతుండటంతో కూటమి నాయకులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న తహసీల్దార్‌కు భూమి యజమానులు కోర్టులో ఉన్న స్టే కాపీ చూపించడంతో తహసీల్దార్‌తో పాటు అధికారులు వెనుతిరిగి వెళ్లారు. ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, సంబంధీకులు సాగు చేస్తున్న భూమిలో శనివారం కూటమి నాయకులు ప్రైవేటు వ్యక్తులతో దౌర్జన్యంగా కంచెను తోసుకుంటూ భూమిలోకి ప్రవేశించి విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. మొక్కలు నాటకుండా అడ్డుపడ్డారు. రూరల్ సీఐ వరప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని గొడవలు జరగకుండా చూశారు.

రాళ్లు మీద పడి బీహార్ కార్మికుడి మృతి



రాళ్లు మీద పడి మృతి చెందిన బీహార్ కార్మికుడు అతుల్‌సింగ్

బి.కొత్తకోట : పని ప్రదేశంలో రాళ్లు మీద పడి ఒకరు మృతిచెందగా, ఇద్దరు గాయపడిన సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బీహార్ గోపాల్‌గంజ్ లక్వర్‌కు చెందిన అమరసింగ్ కుమారుడు అతుల్‌సింగ్(43), పంకజ్‌కుమార్‌సింగ్(40), మధ్యప్రదేశ్‌కు చెందిన రామ్‌ధ్యాన్(45)లు ముగ్గురు ఉపాధి కోసం స్థానికంగా రోడ్డు పనులు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం తుమ్మనంగుట్ట క్వారీ వద్ద టిప్పర్‌లో రాళ్లను లోడ్ చేశారు. లోడింగ్ పూర్తయిన తర్వాత వాహనం పక్కనే నిల్చుని ఉండగా టిప్పర్‌పై నుంచి రాళ్లు జారి వారి మీద పడ్డాయి. ప్రమాదంలో అతుల్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందగా, పంకజ్‌కుమార్‌సింగ్, రామ్‌ధ్యాన్‌లు గాయపడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి



ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన చెరువుపల్లి మధు

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అశోక్‌నగర్ సమీపంలో వినాయకుని నిమజ్జన ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి ట్రాక్టర్ కిందపడి చెరువుపల్లి మధు (29) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కడప నగరంలోని బుడ్డాయపల్లికి చెందిన మధు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. వినాయకుడి నిమజ్జనానికి వెళ్లే సమయంలో ప్రమాద వశాత్తు ట్రాక్టర్ కింద పడ్డాడు. మృతుడి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిన్నచౌక్ ఎస్ఐ పి. రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇంట్లో నగదు, బంగారు చోరీ

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని జె.వడ్డిపల్లి గ్రామంలో ఎద్దుల అనంతయ్య ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్ఐ పి.మహేష్‌లు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. అనంతయ్య ఆరోగ్యం బాగాలేక తిరుపతిలోని తన కుమారుడి వద్దకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా తాళం పగులగొట్టి బీరువాలోని రూ.10 లక్షల 50 వేలు నగదు, 20 తులాల బంగారు దొంగిలించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సుండుపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని జి. రెడ్డివారిపల్లి పంచాయతీ, చెప్పిడివాండ్లపల్లె మార్గమధ్యంలో చెరువుకట్టపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. జీసీ కురవపల్లికి చెందిన మూడే కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒక్కసారి కళ్లు తెరవరా చిన్నా!

- కళ్ల ముందే కొడుకు కన్ను మూత
- తల్లడిల్లిన తల్లిదండ్రులు



మృతి చెందిన అక్షయ నాయక్



విలపిస్తున్న బాలుడి తల్లి

కురబలకోట/తంబళ్లపల్లె : బంధువుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో పాటు సొంత ఆటోలో ఇంటికి బయలు దేరిన చిన్నారిని రోడ్డుపై ఏర్పడిన గుంత శనివారం బలితీసుకుంది. కళ్లముందే బిడ్డ ప్రాణాలు పోవడంతో ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతంగా మారింది. రేయ్ చిన్నా..ఒక్కసారి కళ్లు తెరవరా..లేవరా..అంటూ బిడ్డపై పడి తల్లి రెడెమ్మ విలపించడం చూసినవారి కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. మాటల్లో చెప్పలేని బాధ పిండేసింది. ముదివేడు పోలీసుల కథనం మేరకు..తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండాకు చెందిన మహేష్‌నాయక్, రెడ్డెమ్మ కొడుకు అక్షయ నాయక్ (10)తో కలసి బతుకు తెరువు కోసం పుంగనూరు మండలం సుగాలి మిట్టలో ఉంటున్నారు. అక్కడ ఆటో జీవనాధారంగా మరో వైపు చిరు వ్యాపారం చేసుకుంటూ బిడ్డల్ని చదివించుకుంటున్నారు. ఈ క్రమంలో వారం క్రితం స్వగ్రామం ఆర్ఎన్ తాండాలో జరిగిన పండుగకు భార్యాభర్తలు వెళ్లారు. పండగ చూసుకుని తిరిగి శనివారం ఆటోలోనే పుంగనూరు సుగాలి మిట్టకు బయలు దేరారు. తండ్రి ఆటో నడుపుతుండగా పక్కనే కుమారుడు అక్షయ నాయక్ కూర్చున్నాడు. వెనుక కుమార్తె, తల్లి కూర్చున్నారు. కురబలకోట మండలం దాదంవారిపల్లి వద్ద వస్తుండగా గుంతల రోడ్డు ఉండడంతో ఒక్కసారిగా ఆటోలో నుండి బాలుడు అక్షయ నాయక్ కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఊహించని ఈ హఠాత్ పరిణామంతో భీతిల్లిన తల్లిదండ్రులు హుటాహుటిన అదే ఆటోలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందిన ట్లు చెప్పడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్ప కూలారు. ఒక్కడే కొడుకు. అల్లారుముద్దగా పెంచుకున్నారు. కళ్ల ముందే కొడుకు కన్ను మూయడంతో.. ఎంత పని జరిగిందంటూ బిడ్డను తలచుకుని తల్లిదండ్రులు పుత్ర శోకంతో తల్లడిల్లిపోయారు.

రూ.17 లక్షలు పలికిన లడ్డు



లడ్డు దక్కించుకున్న నాగార్జునాచారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులోని ఎమ్మాస్సార్ వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడికి నైవేద్యంగా సమర్పించిన 23 కిలోల లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించగా రూ.17లక్షలకు వేలం పలికింది. శనివారం రాత్రి నిర్వహించిన ఈ వేలం పాటలో మట్లి సర్పంచ్, లయన్ నాగార్జునాచారి రూ.17లక్షలకు దక్కించు కున్నారు. అలాగే కలశంలోని ప్రసాదాన్ని కూడా రూ.2.4లక్షలకు ఆయనే దక్కించుకున్నారు. కార్యక్రమం నిర్వాహకులు మడితాటి శ్రీనివాసుల రెడ్డి, రంజిత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో రూ.2.20 లక్షలు



లడ్డును దక్కించుకున్న నేలపూజ శివకృష్ణ, హరికృష్ణ

పెనగలూరు : పెనగలూరు కొత్తపల్లిలో నిర్వహించిన వినాయక స్వామి లడ్డు వేలంలో భక్తులు పోటీ పడి పాల్గొన్నారు. నేలపూజ రుద్రాచారి కుమారులు శివకృష్ణ, హరికృష్ణలు రూ.2.20 లక్షలకు వేలంపాట పాడి లడ్డును దక్కించుకున్నారు.

రాజంపేటలో..



రాజంపేట రూరల్: వినాయకస్వామి లడ్డును రూ.2.20వేల దక్కించుకున్న గోపీకృష్ణ

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని నారపరెడ్డిపల్లిలో నిర్వహించిన వేలం పాటలో కొంగాని నడిపి రెడ్డెయ్య కుమారుడు కొంగాని గోపీ కృష్ణ రూ.2.20 లక్షలకు స్వామి వారి లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం జరిగిన నిమజ్జనంలో మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.